
**అసలు నేనీ కథ వ్రాయాలనుకోలేదు. ఒక అసమర్థుని డైరీ పేజీ గురించి నేను వ్రాయదల్చ లేదు. అలా అని నేను రచించటమంటేనే అసహ్యించుకునేవాడిని అనుకోకండి. నేను వ్రాస్తాను... చాలా వ్రాశాను.**




అయినా పాఠకులు మా కోసమే మీరు అంత గొప్ప రచనలు చేశారని నన్ను ఆకాశానికి ఎత్తేశారు. ప్రస్తుతం అక్కడే వున్నాను. సరిగ్గా ఈ టైములో అసమర్థుడి డైరీ పేజీ చదవటం జరిగింది.

అసమర్థుడు ఎవరు? అసలు వాడి పేరేమిటి! కులగోత్రాలేమిటి? వాడికి పెళ్ళాం బిడ్డలు, సాయంత్రం తాగటానికి స్కాచ్ విస్కీ బాటిల్, రాత్రిజల్సా చెయ్యటానికి పిల్ల వున్నారా? అన్నిటికన్నా ముఖ్యం లంచాలు మింగటానికి వీలయ్యే ఉద్యోగమా? లేక రికమెండేషన్లు గట్రా రాసిచ్చి డబ్బు గుంజేసే రకం వుద్యోగమా? ఎలాంటి ఉద్యోగం చేస్తున్నాడు అనే సంగతులు లక్షకోటి రావచ్చు.

అయ్యా! నిజంగా అటువంటి బుద్ధులు, గుణాలు, పొజిషను, సమర్థత వుంటే యిక వాడెందుకు అసమర్థుడవుతాడండి? నడిరోడ్డు మీద కళ్ళుకానక ఫారిన్ కారు క్రిందపడి తన మురికి రక్తంతో ఫారిన్ కారు యొక్క న్యూ టైర్లని ఎందుకు ఖరాబు చేస్తాడండి? గవర్నమెంటోరి హాస్పిటల్ ఆవరణలో బాదం చెట్టు కింద కాలూ చెయ్యీ సాచేసి కుయ్యోకయ్యోమనుకుంటూ పరలోకయాత్రకి ప్రయాణమయ్యి ఎందుకు వెళ్ళిపోతాడండి? ఇవన్నీ జరిగాయి కాబట్టే వాడికి అసమర్థుడనే స్యూటబుల్ నామధేయం పెట్టింది నేనే!

వ్రాసిన నేను, ప్రచురించిన పత్రికలు బాగుపడ్డాయి. మరి పాఠకులు మాటేమిటి అనే కొచ్చెను రావచ్చు. రచనలు చదివి పాఠకులు బాగుపడతారనేది నేను నమ్మను. చెడిపోతారనేదీ నమ్మను.

కాబట్టి మనం చెప్పేది పాఠకులకి ఉపయోగం అవునా? కాదా? అనేది నేను ఆలోచించలేదు ఎప్పుడూ. కాబట్టే గొప్ప రచయిత నయ్యాను. గొప్ప రచనలు చేశానని సన్మానాలు కూడా చేయించుకున్నాను. నిజానికి పాఠకుల కోసం వ్రాశామంటూ రొమ్ములు విరుచుకుతిరిగే నా తోటి రచయితలను పాఠకులు ఏమాత్రం పట్టించుకోలేదు.

నా కోసం నా బీరు సీసాకోసం. నా జల్సాకో, కరపెనీ పిల్ల కోసం. నా పెళ్ళాం ఒంటి నగలకోసం. నా పిల్లల కాన్వెంటుచదువులకోసం నేను వ్రాశాను.

ఓ రోజు, మామూలు ప్రకారం షైరుకి బయల్దేరా. దారిలో ఓ ఆకలి కవి తగిలాడు పెరిగిపోయిన గడ్డంతో, మాసిపోయిన లాల్చీతో. వున్న మాట చెప్పుకోవాలంటే ఈ ఆకలి కవుల కవిత్వం ఎంత కంపు కొడుతుందో. మనుషులూ అంతే. ఫీల్డ్ కుక్కలకిమల్లె.... నాకు చాలా నిర్మొహమాటం ఎక్కువ. అందరి దగ్గర నిర్మొహమాటంగా వుంటాననుకోకండి. యిదిగో

యిలాంటి అణా కవులతోను, కాణీ రచయితలతోను మాత్రం వున్నది వున్నట్టుగా అనేస్తాము. పబ్లిషర్స్, ఎడిటర్స్ నా నెపుమ్మది, మెతకతనం, మొహమాటం గురించి కథలు కథలుగా వర్ణించి మరీ చెప్పుకుంటారు.

ఈ ఆకలి కవితో "మీరెప్పుడూ ఫ్రెంచి పరిమళంలా సువాసనలు వెదజల్లుతూ వుంటారు-" వ్యంగ్యంగా అనేశాను ఒకసారి.... ఒకసారేం ఖర్మ చాలా సార్లు.... అన్నిసార్లు .... వాడు ఓ వెకిలి నవ్వు నవ్వేసి "మేంమనుషులం మాత్రమే సువాసనలు వెదజల్లుతాం. మీరు మొత్తం రాతలు, చేతలు కూడా గాడిదల్ని కాసే వాడి కంపు కొడతారు" అన్నాడు. అంటే నా మాటలో వ్యంగ్యం వాడు గ్రహించాడు కాబోలు. కాని వాడి మాటల్లో గూడార్థం నేసరిగ్గా గ్రహించలేకపోయాను. అయినా దాని గురించి బుర్రబద్దలు కొట్టుకోవాల్సిన అవసరం నాకు లేదు. డబుల్ మీనింగ్ వర్డ్స్ వ్రాయటం వరకే నాపంతు అర్థం చేసుకోవటం.... బుర్రబద్దలు కొట్టుకోవటం చదివే వాడి వంతు.

రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి. అప్పటికే టైము తొమ్మిది దాటుతోంది. ఈ కంపుగాడ్ని వదిలించుకుని బార్‌కి ఎలా వెళ్ళాలా అని తహతహలాడిపోతున్నా.

ఈలోగా సర్రమంటూ ఓ ఫారిన్ కారు వచ్చేసింది. కారుకు ఏదో బోర్డు వ్రేలాడుతోంది. మసక చీకట్లో సరిగ్గా కన్పించలేదు. కాని అది 'ఎల్' బోర్డే అని, ఆ కారు నడిపేది మున్సిపల్ చెయిర్మన్‌గారి ముద్దుల కొడుకని తేలింది.

"ఆహా....ఏం స్పీడు....ఏం రాజసంగా పోతోంది బండి" అని హాశ్చర్యపోతూ ఆనందిస్తుండగా 'అబ్బా' అంటూ ఓ మనిషి మూలుగు విన్పించింది. నేను సరీగా పట్టించుకోలేదు. దినం లేస్తే లక్ష తొంభై మూలుగులు వింటాం. నా లాగే చెయిర్మన్‌గారి కొడుకూ థింక్ చేసి వుంటాడు. అందుకే కారాపకుండా రయ్యిమని దూసుకుంటూ వెళ్ళిపోయాడు.

నా పక్కనున్న కవిగాడు మాత్రం ఒక్క ఉదుటున... మూడంగలు వేసి... మోకాళ్ళమీద కూర్చున్నాడు. నేను వెనగ్గా తాపీగా వెళ్ళిచూస్తే. అసలే నాకుఎరుపన్నా. రక్తమన్నా విపరీతమైన భయం...కళ్ళు మూసేసుకున్నా. భగవంతుడా లేచిన వేళా ముహూర్తం బాగోలేదు. బారులో వెచ్చగా కూర్చుని కాబరే డాన్సర్ హొయలు చూడాల్సిన వాడిని.... ఇదేం విధి ఈ బక్క పీనుగుని, ఎర్రటెర్రటి రక్తాన్ని చూస్తున్నా.

నా జాలీ మూడ్‌ని తన కంపుతో సగం కిల్ చేశాడు ఈ కవిగాడు. మిగతా సగాన్ని ఇదో ఈ దృశ్యం. అనుకుంటూ వణుకుతూనే కళ్ళు తెరిచేసరికి రక్తం మరకలు కన్పించాయి గాని, బక్కపీనుగు కన్పించలే. దూరంగా ఓ లాల్చీ మసక వెలుతురులో తెల్లగా చేతుల్లో దేన్నో మోసుకుంటూ పరిగెడుతూ కన్పించింది.

ప్చ్....వదిలాడు శనిగాడు అని రిలీఫ్‌గా ఫీలయ్యి అడుగేశాను. కాలికి అడ్డం పడుతూ బుసలుకొట్టే పాములా ఏదో అడ్డం పడింది. వంగిచూస్తే.... ఓ డైరీ.... ఎవర్ది....? యింకెవర్ది.... బక్క పీనుగు నుంచి కారిన రక్తంలో తడిసిన డైరీ కాబట్టి ఆ బడుగు శాల్తీదే ఈ వస్తువు అనుకుని పారేయబోయా. కాని క్షణం మనసు పీకింది. ఇదివరలో నేను దొంగతనంగా స్నేహితులవి, పరిచయస్తులవి డైరీలుతీసి చదివాను. కొంతమంది భలే రొమాంటిక్‌గా తమ సెక్స్ ఎక్స్‌పీరియన్స్‌లన్నీ పువ్వుల్లో పెట్టినట్టు భద్రంగా వివరంగా వ్రాసుకున్నారు. వాటిని చదివి కిర్రెక్కిపోయి ఎగస్ట్రా బాటిల్ యింకోటి లాగించేశా అనుకోండి. సరిగ్గా ఈ డైరీలో అలాంటి కిర్రెక్కించే మహాద్భుత విషయాలు వుండొచ్చు అనే ఆశతో డైరీని అక్కడేవున్న చిత్తుకాగితంతో శుభ్రంగా తుడిచి లాల్చీజేబులో పెట్టాను. యిక బార్‌కి వెళ్ళటానిక్కి మనసొప్పలే. యింటివైపుకి నడక డైరక్షన్ మార్చేశా.

కాని అదేం దరిద్రమో యింటికెళ్ళేసరికి లైట్లు లేవు. కరెంట్ కట్ చేశారు మా యేరియాలో అని తెల్సింది.

పక్కవాటాలో వుంటున్న పళ్ళ డాక్టరు దర్టీ ఇండియా అంటూ ఇండియాని ఇండియాలో పుట్టి ప్రస్తుతం ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో తగలడిన వ్యక్తులని చాలా చక్కగా యింగ్లీషులో దీవిస్తున్నాడు. ఆయన యింగ్లీషు పవర్‌కి, కర్త, కర్మ, క్రియలతో మాట్లాడే ప్రోపర్ లాంగ్వేజ్‌కి ముగ్ధుడ్నయి వాటిని వింటూ నేను స్వయంగా ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు వాళ్ళని దీవించటం మర్చిపోయా!

ఆయన దీవెనలు వింటూ డైరీని రేపు చదవొచ్చని డెయిలీ పేపర్సమీద పెట్టి.... కుర్చీలో కూర్చుని కాళ్ళని గోడకేసి నిగడదన్ని మెల్లిమెల్లిగా సిగరెట్టుకాల్చుకుంటూ పక్కపొడి నములుకుంటూ నిద్రలోకి జారిపోయా. ప్రొద్దుట మాత్రం కుర్చీలోంచి లేవకుండా .... మంచం మీదనుంచే లేచాను. బహుశ రాత్రి మా ఆవిడ నన్ను ఓ రెక్కతో ఎత్తి మంచం మీద పడేసి వుండొచ్చు. ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆవిడ పాపం చాలా పతిభక్తిపరాయణురాలు. ఎవొచ్చి బంగారం పిచ్చజాస్తి. నన్ను గ్రాము బంగారానిక్కి ఎవడైనా కొంటానంటే అమ్మేయటానిక్కి సిద్ధపడిపోతుంది పిచ్చిది.

ఆఫీసుకి పోయి... సాయంత్రం తిరిగొచ్చి టిఫిన్ అదీకానిచ్చి డైరీ వ్యవహారం చూసి, బార్‌కెళ్ళాలని అనుకుంటూ డెయిలీ పేపర్లున్న బల్లకేసి చూస్తే ఖాళీ.... భార్యని పిల్చి అడిగితే "పేపరు వాడిక్కి అమ్మేశా" అంది.

## శ్రీ లక్ష్మీ కటాక్షం

వల్లబ్‌భాయ్ షమ్జీభాయ్ తనాకీ పోర్‌బందరులో ఒకఆయుర్వేదవైద్యుడు. గత పదిహేను సంవత్సరాలుగా లాటరీ టిక్కెట్ల మీద ఇరవై వేలకు తక్కువ కాకుండా ఖర్చుపెట్టి ఉంటాడు. అతని శ్రమ వృధా పోలేదు:



ఇంతవరకూఎన్నడూఎవరూలాటరీద్వారా పొందనంత మొత్తం—ఒకకోటీలక్షరూపాయలను రాజస్థాన్ లాటరీ ద్వారా జులైలో పొందారు— శ్రీతనాకీ! ఆయన వయసు 76 సంవత్సరాలు.

అదృష్టవశాత్తూ ఆయన ఆ టికెట్‌ను తన ఆస్పత్రిలో ఉంచారు. ఇంట్లో ఉంచినట్లయితే వరదపాలై పోయుండేది. హఠాత్తుగా అంత పెద్ద మొత్తం వచ్చినా తనాకీ తట్టుకుని నిలబడ్డారు. ఆ బహుమతి సొమ్ములో కొంత భాగాన్ని వరద బాధితులకు ఆయన ఇవ్వడానికి నిర్ణయించుకున్నారు. ఆయనకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదాయం పన్ను, ఏజెంటు వాటా పోగా చివరికి ఆయనకు బహుమతిలో యాభై రెండు లక్షలు దక్కుతాయి.

నాకు నిజంగా ఒళ్ళు మండిపోయింది. ఛడామడా తిట్టేద్దామనుకున్నా. తిట్లు కూడా నాలిక మీదగేదర్ అయిపోయాయి. యిక అవి బయటకి ఫోర్స్‌గా రావడమే తరువాయి. అయినా ఓ బకుగు ఆగంతకుని డైరీ పోయిందని నా బంగారు నగల విగ్రహాన్ని తిట్టటం ఏమంత గొప్ప విషయం కాదని వివేకం హెచ్చరించటంతో నిశ్శబ్దమయిపోయా. అంతటితో ఆ డైరీ విషయం సమాప్తం చేసుకున్నా.

ఓ వారం రోజుల తర్వాత.. ఓ స్నేహితుడు తన యింట్లో పార్టీ పెట్టాడు సందర్భం ఏవిటీ అని అడక్కండి.. చెబితే ఆశ్చర్యపోగలరు. యిలాంటి వాటికూడా పార్టీ - అందునా మందు పార్టీ యిచ్చుకుంటారా అని.

బాటిల్ ఓపెన్ చేసి. పకోడీ పొట్లం విప్పాను. పొట్లం కాయితం ఒక డైరీ కాయితం. అది ఆ బక్కపీనుగు డైరీకాగితమే. ఎందుకంటే ఆ కాగితం కొసలు ఎర్రెర్రగా ఉన్నాయి. అంతకన్నా రుజువు నాకవసరం లేదు. నేను మరీ సందేహాలని పెంచుకునే మనిషిని కాను. గబగబా కాగితాన్ని సాపుచేసి ఓ చేత్తో పట్టుకుని. మరో చేత్తో ఛీర్స్ కొట్టి స్కాచ్ విస్కీని సిప్ చేస్తూ చదివేశాను.

అది చదవటం పూర్తయ్యాక నా మీద నాకే కోపమొచ్చింది. టూ మినిట్స్ టైమూ వృధాగా దాన్ని చదవటంలో గడిపేసేనే అని. ఇంతకీ ఆ అసమర్థుడు రాసిన రాతలేమిటో తెలుసా? దేశంలో ఆకలి. బిచ్చగాళ్ళు. శ్రమ శక్తిని దోచుకోవడం. శ్రామికుల చెమటలు అంటూ ఏవేవిటో వ్రాశాడు. నిజానికి ఓ ముక్క కూడా నాకర్థమవలేదు.

నిజమే. దేశంలో ఆకలుంది. దానికి యింత గొడవెందుకు? ఆకలుంది. ఆకలి లేకపోవడమూ వుంది. ఆకలితో చచ్చేవాళ్లు వున్నారు. తిండి ఎక్కువై త్రేన్చేవాళ్ళు వున్నారు. బిచ్చగాళ్ళు వున్నారు. బిచ్చం వేసేవాళ్ళు వున్నారు. పల్లకి ఎక్కిన వాళ్ళుంటే లోకానికి అంత కసేమిటి? ఉత్త పల్లకీని మోయటం పల్లకీ బోయీలకి మాత్రం బాగుంటుందా? ఆ మాటకొస్తే పాపం పల్లకీలో కూర్చున్నవాడికి మాత్రం కుదుపులకి ఒళ్ళు అలసిపోయి, చెమటకి గుడ్డలు తడిసిపోయి వాడికష్టాలు వాడికుంటాయి కదా!

యిలాంటి అతి సాధారణ విషయాల్ని ఏవిటో దోపిడీ వ్యవస్థని బూర్జువా పద్ధతని. పెట్టుబడిదారుల అక్రమం అని. వ్యవస్థని కూలదొయ్యాలి అంటూ ఆలోచించటం చాలా వింతగా వుంటుంది. అతి మామూలు విషయాల్ని అతి మామూలుగా తీసుకోవాలి అని నా సిద్ధాంతం!

నా ఈ మాటలు వినే క్రిందటి మంత్రిగారి అమ్మాయి పెంపుడు కుక్కపిల్ల 'టో నీ' బర్త్‌డే పార్టీలో కలక్టరు గారు ప్లీజయిపోయి "మీరు నోబెలు బహుమతి పొందాల్సిన వారండీ" అన్నారు. మహానుభావుడు అంత మాటన్నాడు చాలదూ? అదీ సంగతి. యింతకీ చెప్పొచ్చేదేమిటంటే.... నీ అన్నం నువ్వు తిను. నీ బీరు నువ్వు తాగు. అంతేగాని ఎవడో ఆకల్లో మండిపోతున్నాడు అని ఆలోచించి నువ్వు తిండి. తాగుడు మానేస్తే నష్టం ఎవరికి అంట? కౌశికుడు. ధర్మవ్యాధుల కథ విన్నారా? ధర్మవ్యాధుడు కౌశికుడికి బోధించినట్టు ధర్మం వేరు. ధర్మ సూక్ష్మం వేరు. అబద్ధాలు ఆడకూడదు అనేది ధర్మమయితే వెయ్యి అబద్ధాలు ఆడి ఒక పెళ్ళి చెయ్యి అనేది ధర్మసూక్ష్మం కాబట్టి ధర్మం మర్చిపొండి. ధర్మసూక్ష్మాన్ని జ్ఞాపకం వుంచుకుంటే బాగుపడతారు. జీవితంలో పైకెక్కివస్తారు. లేకపోతే అదో ఆ అసమర్థుడిలా లేకపోతే ఆ ఆకలి కవిలా మిగిలిపోతారు. నా లాంటి ధర్మసూక్ష్మాలెరిగిన వాళ్ళని దుయ్యబడతారు. అదీ కథ. నేచెప్పాల్సిన నీతి.... మీరేమంటారు?

✳

గాథావళి :

## తిట్లు తింటాను



పరిహాసప్రియుడైన లోకమాన్య బాల గంగాధర తిలక్ ఒకసారి తమ పిల్లలతో కూర్చుని టీ త్రాగుతున్నారు.

"బాబాజీ! మేము టీ త్రాగేటప్పుడు బిస్కట్లు తింటాం. మీరేమీ తినరెందుకు?" అని అడిగారు పిల్లలు.

"ఎందుకు తినను? తిననని ఎందుకనుకున్నారు? నేనూ తింటాను. కడుపునిండా తింటాను-" అన్నాడు తిలక్.

"మరి మీరేమి తింటారో మాకు కనిపించదే?" అడిగారు పిల్లలు.

"అవును. అది మీకు కనిపించదు. న్యూస్‌పేపర్లలో పడే తిట్లను టీ త్రాగుతూ తింటాను-" అన్నాడు తిలక్.

ఇది లోకమాన్యుని ఛలోక్తిమయ ప్రసంగ సరళికి చక్కని నిదర్శనం.

సేకరణ :

బద్దిగం పాండురంగారెడ్డి

